1
నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 19 జూన్ 2023



మూఢనమ్మకాల పేరుతో దళిత బలహీన వర్గాలపై దాడులా?



నవ తెలంగాణ-సదాశివపేట

మండలంలోని కొల్కూర్ గ్రామంలో చేతబడి బాణామతి చేస్తున్నారనే నెపంతో దళిత బలహీన వర్గాలకు చెందిన వారిని గ్రామపంచాయతీ వద్ద 6 గంటలపాటు తలకిందులుగా చెట్టుకు కట్టేసి అత్యంత కిరాతకంగా కొట్టడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. ఆదివారం కొల్కూర్‌లో బాధితుడు యాదయ్య కుటుంబాన్ని కేవీపీఎస్ బృందం పరామర్శించారు. గ్రామంలో ఒక వ్యక్తికి సుస్తి అయితే మంత్రగాని దగ్గరికి వెళ్తే మీ గ్రామంలో చేతబడి బాణామతి చేసే వాళ్లున్నారని చెప్పడంతో మాదిగ కులానికి చెందిన ముత్తంగి యాదయ్య, అతని భార్య అమృత, శ్యామలను శనివారం గ్రామ పంచాయతీ వద్ద చెట్టుకు వేలాడ దీసి తీవ్రంగా కొట్టడం దారుణమన్నారు. యాదయ్యను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో మునిగి తేలియాడుతుంటే ఇంకా చేతబడి బాణామతి మూఢ నమ్మకాల పేరుతో అత్యంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ దాడులన్నీ దళితులు బలహీనవర్గాలపైనే జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి.అశోక్, మండల అధ్యక్షులు టి.మల్లేశం నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

సీఐటీయూతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య





నవతెలంగాణ-సంగారెడ్డి

కార్మికులకు మంచి వేతన ఒప్పందాలు, కొత్తగా పెర్మనెంట్ చేయడం లాంటివి సీఐటీయూతోనే సాధ్యమని.. కార్మికుల సమస్యలు సీఐటీయూ ద్వారానే పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే. రాజయ్య అన్నారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఆదివారం కిర్బీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఐటీయూతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మంచి వేతన ఒప్పందాలు, కొత్తగా పెర్మనెంట్ చేయడం సీఐటీయూకే సాధ్యమన్నారు. కార్మికుల బాధలు తెలిసిన సంఘం సీఐటీయూ మాత్రమేనన్నారు. అందుకే కార్మికులందరూ సీఐటీయూను ఆదరించాలని పిలుపునిచ్చారు. అనేక పరిశ్రమలలో మంచి వేతన ఒప్పందలు సాధించడం.. కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసిన ఘనత సీఐటీయూకు మాత్రమే ఉన్నదన్నారు. మిగతా సంఘాలు కార్మిక ముసుగులో యజమానులు తొత్తులుగా ఉంటాయని ఆరోపించారు. కార్మికుల పక్షాన నిలిచే ఏకైక సంఘం సీఐటీయూ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తలారి శ్రీనివాస్, మల్లేష్, శంకర్, హనుమంత్, లక్ష్మణ్, గోపి, రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల రక్షణలో డీడీఎస్ పాత్ర ఎంతో కీలకం



నవతెలంగాణ-జహీరాబాద్

చిరుధాన్యాలను రక్షించడం.. వాటిని నాటడం, విత్తనాల సంరక్షణ, దేశ విదేశాలకు చిరుధాన్యాలను విత్తన రూపంలో ఎగుమతులు చేయడం, చిరుధాన్యాల ప్రాధాన్యతను చాటుతూ వివిధ రకాల జాతరలు కార్యక్రమాలు నిర్వహించడం లాంటి కార్యక్రమాల్లో డీడీఎస్ పాత్ర ఎంతో కీలకమైందని డీడీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వినోద్, పావురాల డాక్టర్ రుక్మిణి రాములు అన్నారు. చిరుధాన్యాల సంవత్సరం-2023 నినాదంతో జహీరాబాద్ పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పస్తాపూర్ లోని డీడీఎస్ కార్యాలయంలో సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా వారు పాల్గొని మాట్లాడారు. ఏండ్ల తరబడి జహీరాబాద్లో తమ సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాల కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయ మైందన్నారు. నిరక్షరాశ్యులు అయిన మహిళలు వివిధ దేశాలకు వెళ్లి చిరుధాన్యాల ప్రాధాన్యతను చాటడం జరిగిందని గుర్తు చేశరు. విత్తనాలను రక్షించడంలో, విత్తన రూపంలో పంపిణీ చేయడంలో ఇక్కడి రైతులు చేస్తున్న కృషిని వివిధ దేశాల అభినందించాయన్నారు. 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమే కానీ చిరుధాన్యాల రైతులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఎక్కడ కూడా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. చిరుధాన్యాలను నాటిన రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట నష్టపోతే వారిని ఆదుకునేందుకు ఒక ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు రైతులకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తాము వివిధ ప్రభుత్వాలు ముందు నివేదిక రూపంలో విజ్ఞప్తులను కూడా పెట్టినట్టు తెలిపారు. అనంతరం డీడీఎస్ మాజీ డైరెక్టర్ పీవీ సతీష్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సతీష్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ సభ్యులు రైతులు వినోదమ్మ, నరసమ్మ, కృష్ణవేణి, చంద్రమ్మ, లక్ష్మమ్మ ,మాణిక్యం, ఏసు, మయూరి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని తాగడంతో ఆరోగ్యం



నవతెలంగాణ-తొగుట

అన్ని రకాల పోషకాలున్న నీటిని తాగాలని మిషన్ భగీరథ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం వెంకట్రావుపేట గ్రామంలో తాగునీటిని పరీక్షించారు. మూడు రకాల నీటిని విద్యుత్ బల్బ్ ద్వారా పరీక్షించారు. ప్రజలు తాగు నీరు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. గ్రామాల్లో ఉండే ఫిల్టర్, బోరు బావి, మిషన్ భగీరథ నీళ్లను విద్యుత్ బల్బ్‌తో పరిశీలించారు. మిషన్ భగీరథ నీటిలో 400 పైగా పోషకాలు విద్యుత్ బల్బ్ ఫుల్ గా వెలిగింది,బోరుబావి నీటి లో 200 పైగా పోషకాలు కొంచెం తక్కువగా బల్బ్ వెలిగింది, ఫిల్టర్ నీటిలో ఎలాంటి పోషకాలు లేవు విద్యుత్ బల్బ్ వెలగలేదు.దీనిని ప్రజలు తాగునీరు వాడే విధానం మార్చు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఫిల్టర్ నీరు తాగడం వలన అనేక సమస్యలు వస్తాయని నిరూపించారు. సర్పంచ్ పాత్కుల లీలదేవి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు, అంగన్వాడీ టీచర్లు వీణా, జ్యోతి, స్వప్న, ఆశా కార్యకర్తల భాగ్యలక్ష్మి, యాదమ్మ,వినోద,వెలిగు సిప సుధ, బుజ్జి ఉన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) దూళ్మిట్ట మండల విస్తృతస్థాయి సమావేశం సుద్దాల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ రైతుల రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామంటూ 2018 ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని, నాలుగున్నర ఏండ్లు గడుస్తున్న రుణాలను మాఫీ చేయలేదని అన్నారు. గతంలో రూ.25 వేలలోపు ఒకసారి, రూ.50 వేలలోపు మరోసారి మాఫీ చేస్తామని చెప్పినా రైతులకు ప్రయోజనం కలుగ లేదన్నారు. రైతాంగానికి కొత్త అప్పు బ్యాంకుల నుంచి రాలేదన్నారు. వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ తర్వాత లక్షలు అప్పు ఉన్న రైతులకు రూ.50 వేల అదనపు వడ్డీ పడిందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అరికట్టాలన్నారు. నాణ్యమైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. వృత్తిదారులకు సహాయం అందిస్తామన్న ప్రభుత్వం గడువు పెంచాలన్నారు. ఆదాయ సర్టిఫికెట్ల కోసం మండలాల్లో వృత్తిదారులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అనేక సాంకేతిక సమస్యల వల్ల సర్వర్ డౌన్ ఉండడం వల్ల సరైన సమయంలో ధ్రువపత్రాలు అందక వృత్తిదారులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం గడువు పెంచి అర్హులైన వృత్తుదారులందరికీ ఆర్థిక సహాయం అందించాలన్నారు. గ్రామాల్లో స్థానిక సమస్యలు పరిష్కారం కాక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధరణిలో ఉన్న లోస్కులు సవరించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురవక వ్యవసాయ పనులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 కూలి గిట్టుబాటు అయ్యే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం సీపీఐ(ఎం) ఉద్యమిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కేవలం ఎర్ర జెండా ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. పోరాటాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్,నాయకులు ఆముదాల రంజిత్ రెడ్డి సత్యనారాయణ, చొప్పరి కనకయ్య, మల్లం మొగిలి,సిద్దులు, ప్రసాద్, కిష్టయ్య, గట్టయ్య,రాజు, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

సమైక్య పాలనలో తాగునీటి కోసం సతమతం

- మిషన్ భగీరథ పథకంతో తాగునీటి లక్ష్యం పూర్తి
- ప్రతి పల్లెలో ఇంటింటికి జల సిరి
- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్





నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

'సమైక్య పాలనలో ఎండాకాలం వచ్చిందంటే 'పానీ'పాట్లతో అల్లాడి పోయారు. తెలంగాణలో మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి తాగునీటిని అందించి తాగునీటి కష్టాలు లేకుండా చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ఎల్ఎండి కాలనీ తిమ్మాపూర్ గ్రామంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ మంచి నీళ్ల పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా ప్రతి ఇంటికి నల్లాల ద్వారా పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. ప్రతి పల్లె, తండా, గ్రామం, పట్టణం, మారుమూలన ఉన్న ప్రాంతాలకు కూడా పైపులైన్లు వేసి మిషన్ భగీరథ పథకం నూటికి నూరుశాతం లక్ష్యాన్ని సాధించిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 304 గ్రామాలలోని 456 ట్యాంకులకు 321.64 కిమీ అంతర్గత పైపులైన్ల ద్వారా 22,492 నల్లా కనెక్షన్ల ద్వారా మిషన్ భగీరథ నీళ్లను అందించడం జరుగుతుందని తెలిపారు. తెలగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మిషన్ భగీరథ' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 'హర్ ఘర్ జల్' పథకం పేరుతో అమలు చేస్తుండటం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఎల్ఎండి కాలనీలో ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం రూ.1800 కోట్లతో నిర్మాణం అయి 125 ఎల్ఎండి నీటి శుద్ధి కేంద్రంలో శుద్ధి చేసి 1610.95 కి. మీ పైపుల ద్వారా మంచి నీరు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ , బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జి.వి రామకృష్ణ రావు , అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ , ప్రజాప్రతినిధులు, నాయకులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథతో ఇంటింటికీ స్వచ్ఛ జలాలు

నవతెలంగాణ-రామచంద్రాపురం

మనిషి బతికేందుకు అత్యంత అవసరమైన రక్షిత మంచినీటిని అందించేందుకు మిషన్ భగీరథ అనే మహత్తరమైన పథకాన్ని ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథుడు అయ్యాడని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో బిందెడు మంచినీటి కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితుల నుండి పొయ్యి కాడికే మంచినీళు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 17వ రోజు రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి మంచినీల పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకుల నిర్లక్ష్యం మూలంగా బిందెడు నీటి కోసం చెలిమల్లో, వాగుల్లో, వంకల్లో దొరుకుతాయన్న ఆశతో కిలోమీటర్ల దూరం నడిచే దుర్భర పరిస్థితిలు ఉండేవన్నారు. మంచినీరు లభించని గ్రామాలకు ఆడపిల్లను సైతం ఇచ్చే పరిస్థితులు ఉండేవి కాదన్నారు. అలాంటి పరిస్థితుల నుండి ప్రతి ఇంటికి ప్రతిరోజు రక్షిత మంచినీరు అందిస్తూ తెలంగాణ ప్రజల పాలిట ముఖ్యమంత్రి కేసీఆర్ భగీరథుడిగా పేరు పొందారని అన్నారు. ప్రతి ఇంటికి ఉచితంగా నెలకు 20 వేల లీటర్ల మంచినీటిని అందిస్తూ, దారిద్రరేఖకు దిగువన ఉన్న పేదలకు రూపాయికి మంచినీటి నల్ల కనెక్షన్లు అందిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రజల సంక్షేమం, అభివద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ ఎంపీపీ దేవానంద్, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్ రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శ రెడ్డి, పుష్ప నగేష్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ బాలయ్య జలమండలి రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్, జనరల్ మేనేజర్ నారాయణ, డిప్యూటీ జనరల్ మేనేజర్లు చంద్రశేఖర్ రెడ్డి, శివకృష్ణ, శివ, టిఆర్ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేష్, ఉద్యోగులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థిని లిఖిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి



నవ తెలంగాణ- గజ్వేల్

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్య చేసుకున్న లిఖిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆమె కుటుంబలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్‌ఐటీలో మృతి చెందిన గజ్వేల్ నియోజకవర్గం తిప్పరం గ్రామానికి చెందిన లిఖిత విద్యార్థి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం తాటికొండ రవి మాట్లాడుతూ బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల మరణాలు జరుగుతున్నా యూనివర్సిటీ యాజమాన్యాలు ఎందుకు సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. యూనివర్సిటీ పరిధిలో సీసీటీవీలు లేవని, ఉన్న సీసీటీవీలు పనిచేయడం లేదని, పర్యవేక్షకులు లేరని అన్నారు. యూనివర్సిటీ ప్రక్షాళన చేయాలన్నారు. ఇంత జరుగుతున్నా కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం చొరవ చుయించి లిఖిత మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్నారు. ప్రభుత్వం లిఖిత కుటుంబాన్ని ఆదుకొని రూ.20 లక్షల ఎక్స్ గ్రెసియా ఇవ్వాలన్నారు.అలాగే రోజు పని చేస్తే ఇంట్లో పూట గడిచే పేద కుటుంబం కావున రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం ఒక ప్రభుత్వ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వన్ని డిమండ్ చేశారు. ఉన్నత చదువుల కోసం వెళ్ళిన విద్యార్థులు ఇలా వరుస మరణాలు సంభవించడం సీగుచేటన్నారు. వెంటనే ప్రభూత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అరవింద్, దాసరి ప్రశాంత్, కెవిపిస్ జిల్లా కార్యదర్శి నవీన్ ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి శేఖర్ నాయకులు శివ, నితిన్ తదితరులు ఉన్నారు.

గజ్వేల్ అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకుంటాం

ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్తామని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఆదివారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలో అభివృద్ధి పనులతో పాటు వేజ్ నాన్ వెజ్ మార్కెట్ ను గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంత పెద్ద మార్కెట్ కట్టించడం చాలా బాగుందన్నారు. ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఇలాంటి మార్కెట్లు నిర్మాణం చేపడతామన్నారు. గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో గజ్వేల్ దేశంలోనే గుర్తింపు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. చిరు వ్యాపారులకు వేజ్ నాన్ వెజ్ మార్కెట్లో సకల సౌకర్యాలు ఉన్నాయని ఆమె అన్నారు. ఆలేరు నియోజకవర్గం ముఖ్య నాయకులు, గజ్వేల్ బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగా లేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి



నవ తెలంగాణ - సిద్దిపేట

స్థానికంగా లేని వార్డెన్ల పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా స్థానికంగా లేని హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్డెన్లు హాస్టళ్లలో ఉండకుండా బయట కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఇలాంటి వార్డెన్ల వల్ల హాస్టల్ వ్యవస్థ దెబ్బ తింటుందన్నారు. వార్డెన్లు హాస్టల్లో ఉండకుండా బయట బిజినెస్‌లు, రియల్ ఎస్టేట్ చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వాళ్ల వల్ల అనేక సమస్యలతో హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇలాంటి వార్డెన్లను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిలు నాచారం శేఖర్, చెప్యాల సంతోష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన ఎర్రబాగు సాయికుమార్(25) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం మెదక్ ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉపసర్పంచ్ గురాల స్వామి, వంటి మామిడి మార్కెట్ కమిటి డైరెక్టర్ రాందాస్ గౌడ్,అత్మ కమిటి డైరెక్టర్ బబ్బూరి రాములు గౌడ్,అత్మ కమిటి డైరెక్టర్ జాలని బాలనర్సయ్య,పీఏసీఎస్ డైరెక్టర్ సంజీవులు, నాయకులు గందమల్ల మస్తాన్, తోట సత్తయ్య, సాయిలు తదితరులున్నారు.

విద్యుద్ఘాతంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి

- గాగీల్లపూర్ కావేరీ సీడ్స్ ఆవరణలో ఘటన
- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని సీపీఐ(ఎం) డిమాండ్
- రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కావేరి సీడ్స్ యాజమాన్యం



నవతెలంగాణ-బెజ్జంకి

మొబైల్ చార్జింగ్ పెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులోని కావేరి సీడ్స్ ఆవరణలో ఆదివారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు... చిన్నకోడూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన మెట్ల పర్శరాములు(32) అంపీల్ సెక్యూరిటీ సంస్థలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగంలో చేరాడు. గతంలో చింతమడకలో పని చేసి బదిలీపై వచ్చి నాలుగెండ్లుగా గాగీల్లపూర్ గ్రామ శివారులోని కావేరి సీడ్స్ సంస్థలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం మొబైల్ చార్జింగ్ పెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద బోరున విలపించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగించడం వల్ల విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడని, బాధిత కుటుంబానికి కావేరి సీడ్స్ యాజమాన్యం న్యాయం చేయాలని మృతుని బంధువులు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మృతునికి భార్య లత(30), కుమారుడు రిషి(09), కుమార్తె ప్రవీణ్న(06) ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీన్ రాజు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పర్యవేక్షించారు. మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ ప్రవీన్ రాజు తెలిపారు.

ఆర్థిక సాయం కోసం 9 గంటల నిరీక్షణ

పేదరికంతో కొట్టామిడుతున్న తమ కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని.. కావేరి సీడ్స్ యాజమాన్యం మానవత్వంతో తమ కుటుంబానికి ఆర్థిక సహాయమందజేయాలని మృతుని కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి సంఘటన జరిగిన ప్రాంతంలో సుమారు 9 గంటలు మృతదేహంతో నిరీక్షించారు.

రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడం సరైందికాదు

అంపీల్ సెక్యూరిటీ సంస్థలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగంలో చేరి విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో కావేరి సీడ్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వినియోగించే విద్యుత్ వల్ల మెట్ల పర్శరాములు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందడం బాధాకరమని.. పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి కావేరి సీడ్స్ యాజమాన్యం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి న్యాయం చేయాలని సీపీఐ(ఎం) పార్టీ పక్షాన డిమాండ్ చేసింది. యాజమాన్యం కేవలం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం సరైందికాదని మానకొండూర్ నియోజకవర్గ సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి మాతంగి శంకర్ అసహనం వ్యక్తం చేశారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితుడికి అప్పగింత



నవతెలంగాణ-చేర్యాల

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకుని బాధితునికి సీఐ పి.సత్యనారాయణ రెడ్డి, సిబ్బంది ఆదివారం అప్పగించారు. సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన బసవరాజు వెంకటేష్ వీఐవీఓ మొబైల్ ఫోన్‌ను ఈ నెల14న పోగొట్టుకున్నారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన %ఋఋ.ఎవఱఓ.ఫ్రశీఙ.ఱఅ% అనే వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్ ఎంటర్ చేసి బ్లాక్ చేశాడు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి ఫోన్‌లో సిమ్ కార్డు వేసుకోవడంతో ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న వ్యక్తికి చేర్యాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైతే ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని, తద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి తొందరగా పొందుతారని తెలిపారు.


చైన్ స్నాచింగ్ నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

చైన్ స్నాచింగ్ చేసిన నిందితుడిని 24 గంటల్లో గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివా రం నిందితుని వివరాలను సీఐ వీరప్రసాద్ వెల్లడించారు. ఐనమూ తి వెంకటలక్ష్మి(69) ప్రశాంత్ నగర్ గజ్వేల్ పట్టణానికి చెందిన మహిళ శనివారం మధ్యాహ్నం గజ్వేల్ ఎస్బిఐలో వృద్ధాప్య పెన్షన్ తీసుకుని ఇంటికి వెళ్తోంది. అదే సమయంలో ఆమె వెనుకాల గంగా కుమార్రాయ్ గ్రామం సాహెబ్ గండీ, రాష్ట్రం జార్కండ్ వెళుతున్నాడు. ఇంటికి కొద్ది దూరంలో నిందితుడు చుట్టుపక్కల ఎవరు లేనిది గమనించి మహిళ మెడలోంచి చైన్ లాక్కొని పారిపోయాడు. ఫిర్యాదిరాలు తన మనమడు ఐనమూతి విజయ్ కుమార్‌తో గజ్వేల్ పోలీస్ స్టేషన్ కు వచ్చి గుర్తుతెలియని దొంగ తన మెడలోని చేను దొంగలించుకుని పోయినాడని ఫిర్యాదు ఇచ్చింది. కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. కేసు పరిశోధనలో భాగంగా ప్రశాంత్ నగర్ లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి నిందితున్ని సీసీ కెమెరాలు ఫుటేజ్ ద్వారా గుర్తించారు. గజ్వేల్ పట్టణంలో వెతికి పట్టుకొని విచారించారు. పది రోజుల క్రితం కూలీ పని చేయడానికి వచ్చానని తెలిపాడు. అతని వద్ద నుండి దొంగలించిన 4 తులాల బంగారు గొలుసు రికవరీ చేశారు. నిందితుని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. 24 గంటల్లోపు కేసును ఛేదించిన గజ్వేల్ సీఐ వీరాప్రసాద్, ఎస్ఐ నరేష్, కానిస్టేబుళ్లు సుభాష్, యాదగిరి, వెంకటేష్, రవిలను ఏసీపీ మడత రమేష్ అభినందించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-నంగునూరు

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంగునూరు మండలం రాంపూర్ గ్రా మంలో చోటు చేసుకుంది. రాజగోపాల్ పేట ఎస్ఐ రాజు గౌడ్ కథనం ప్రకా రం వివరాలు ఇలా ఉన్నా యి... రాంపూర్ గ్రామా నికి చెందిన బోదాసు ఎల్లం(40) గత నాలుగు సంవత్సరాల నుండి మద్యానికి బానిసయ్యాడు. మూడు సంవత్సరాల క్రితం అతని భార్య ఎల్లం వదిలి పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటినుండి రాంపూర్ గ్రామంలో బోదాస్ ఎల్లం ఒక్కడే ఇంటి వద్ద ఉంటున్నాడు. మద్యం బాగా తాగి శనివారం గడ్డమీది కుంట వద్ద కానుగు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవతెలంగాణ-మర్కుక్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం చేబర్తి గ్రామానికి చెందిన ఏర్రబాగు సాయి కుమార్ (25) శుక్రవారం తన ముగ్గురు స్నేహితులతో కలసి కారులో ఆంధ్రప్రదేశ్‌కు బయలు దేరారు. శనివారం ఉదయం నర్సరావు పేట వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కన రోడ్డు మీద ఆగి ఉన్న లారీని డీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న సాయి కుమార్‌కు తీవ్ర గాయాలైయాయి. కారులో మరో ముగ్గురికి పాక్షికంగా గాయాలైయ్యాయి. క్షతగాత్రులను నర్సరావు పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడిన ఏర్రబాగు సాయి కుమార్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. గాంధీ ఆసుపత్రి లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామమైన చేబర్తికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలుపుగోలుగా ఉండే సాయి మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణానికి చెందిన నలుగురికి, మండలానికి చెందిన ముగ్గురికి మొత్తంగా ఏడుమంది లబ్దిదా రులకు రూ.3,19,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఆది వారం అందజేశారు. నిరుపేదలకు వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి.. దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలిపారన్నారు. అనం తరం సీఎం కేసీఆర్ కు, మంత్రి హరీశ్‌రావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట యాదమ్మ కృష్ణయ్య, సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి పట్టణ మండలాధ్యక్షులు చీలవ ఎల్లన్న, పెద్ద గొల్ల ఆంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శి పి. వీరేశం, మల్లగౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బేగరి సుధాకర్, సర్పం చులు కుమార్, రాములు, నరేష్ గౌడ్, సలావుద్దీన్, నాయకులు రామాగౌడ్, శంకర్, శ్రీశైలం, ప్రదీప్ జైన్, కాజా, శ్రీధర్ రెడ్డి, వాదోని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంచినీటి పండుగ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పురపాలక సంఘంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచి నీళ్ళ పండుగ నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వాటర్ కార్మికులను శాలువాతో సత్కరించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొంగుల విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత నీటి సమస్య లేకుండా ఇంటింటికి నీటి సరఫరా చేయడం తెలంగాణ ప్రభు త్వానికి దక్కిందన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు ప్రతీ బస్తీలో నీటి సమస్యతో మహిళలకు తీవ్ర ఇబ్బందులు కలగాయ న్నారు. కానీ మిషన్ భగీరథతో నీటి సమస్య లేకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకే దక్కిందన్నారు. నీటిని వృధా చేయకుండా ప్రతి పౌరుని పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లత విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ యాకూబ్ అలి, కమీషనర్ చంద్ర శేఖర్ మున్సిపల్ డిప్యూటీ ఈ ఈ ఇంతియాజ్ అహ్మద్, ఆర్వో విజయ లక్ష్మి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జల ప్రగతి ఉత్సవాల్లో పాల్గొన్న వి.చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఐడీఎబొల్లారం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రామచంద్రపురం పట్టణంలో జలమండలి జల ప్రగతి కార్యక్రమంలో మంచినీళ్ల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు పటాన్చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా జరిగిన జలమండలి జల ప్రగతి కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్లు, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయొచ్చు

నవతెలంగాణ-అమీన్‌పూర్

రక్తదానం చేయడంతో మరొకరికి ప్రాణదానం చేసిన వాళ్లవుతామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి సెంథన్ గ్రీన్ పార్క్ కాలనీలో భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి వెలిగించి రక్తదాన శిబిరాన్ని నీలం మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవసరం ఉన్నవారికి రక్తాన్ని అందించేందుకు రక్తదాన శిబిరం నిర్వహించడం మంచి విషయమన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు మరిన్ని నిర్వహించి ఇతరులకు ఉపయోగపడాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు అలాంటి వారికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నీలం మధు ముదిరాజ్ ను రక్తదాన శిబిరం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వి రాధాకృష్ణ, బసవరాజు శ్రీనివాస్, రామ సుధాకర్ శర్మ,ప్రశాంత్ రెడ్డి,మహేందర్ రెడ్డి, సర్వేశ్వర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం కాదది.. ప్రమాదం



- ఏండ్లుగా మరమ్మతులకు నోచుకోని దారులు
- కంకర తేలి ప్రమాదకరంగా మారిన వైనం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

నవతెలంగాణ-వట్‌పల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని చాలా వరకు రోడ్లు కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. పదేండ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి సడక్ యోజన కింద గ్రామీణ రోడ్లను విస్తరించారు. నాటినుంచి రోడ్లను పట్టించుకోకపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఈ రోడ్లగుండా ప్రయాణించాల్సిన దుస్థితి దాపరించింది. వట్‌పల్లి మండలంలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉన్నది. మండలంలోని చాలా వరకు గ్రామాల్లో రోడ్లన్నీ కంకర తేలి అధ్వానంగా తయార య్యాయి. ఈ రోడ్ల గుండా ప్రయాణం చేస్తే అటు ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే గాకుండా వాహనాలు సైతం తొందరగా చెడిపోయి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఆపద సమయంలో కిరాయి కి రావాలన్నా.. ఈ రోడ్డును చూసి జంకుతున్నారని.. ఎవరూ కూడా ముందు కు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300 కిరాయికి ఆశపడితే వాహనాలు దెబ్బతిని రూ.3000 ఖర్చు అవుతుందని వాహనదారులు భయపడుతున్నారు.

రోడ్లపై నడవలేని దుస్థితి ఉన్నది



గ్రామీణ రోడ్లు కంకర తేలి నడవలేని దుస్థితి నెలకొన్నది. అధికారులు, నాయకులు కంకర తేలిన రోడ్ల వైపు కన్నెత్తి చూడట్లేదు. ఈ రోడ్లతో ప్రజలు కన్నీళ్లు రాల్చుతుంటే.. అధికారులు, నాయకులు దశాబ్ది ఉత్సవాలు అంటూ సంబరాలు జరుపుకోవడం అవసరమా?.

- జనార్దన్ దుద్యాల

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

గత ఆరు నెలల క్రితం 2022-2023 సంవత్సరానికి సంబంధించి గ్రామీణ రోడ్లకు ఎస్‌డీఫ్ నిధులు మంజూరయ్యాయి. బూత్యార్ రోడ్డుకు సంబంధించి 3.200 కిలోమీటర్లకు రూ.70,66,822, పాలడుగుకు 2 కిలోమీటర్లకు రూ.47,56,980, గౌతా పూర్‌కు 1.200 కిలోమీటర్లకు రూ.39,19,848, బిజిలి పూర్, బుడ్డాయా పల్లి, పెద్దపూర్‌కు 5.400 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1,42,43,228, పెద్దపూర్, పోతుల బోగూడకు 3.20కిలోమీటర్లకు రూ.1,05,72,497 నిధులు మంజూరు చేసి టెండర్ వేస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. పల్వట్లా, ఉసిరిక పల్లి రోడ్లకు నిధులు మంజూరైనా అధికారులు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తారనే అపోహతో, ఏండ్లు గడిచినా బిల్లులు చెల్లించరనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిజిలి పూర్ నుంచి బుడ్డయ్యపల్లి పెద్దాపూర్ శివారు వరకు నాలుగు నెలల క్రితం రోడ్డు పనులు ప్రారంభమైనా ఇప్పటివ రకు పూర్తి చేయలేదు. దుద్యాల రోడ్డు కంకర వేసి ఏడాది దాటిపోయినా.. బీటీ రోడ్డుగా మార్చకపోవడంతో రేగోడు వైపు వెళ్లే గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లపై వెళ్లే వారు తరచూ కిందపడి గాయాల పాలవుతున్నారు. నాగులపల్లి రోడ్డు 10 ఏళ్ల దాటినా 400 మీటర్ల రోడ్డు ముందుకు సాగడం లేదని నాయకులు తీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హామీలు హద్దులు దాటినా.. పనులు మాత్రం గోడలు దాటడం లేదని ఆరోపిస్తున్నారు. దశబ్ది ఉత్సవాల్లో సంబురాలు జరుపు కుంటున్న నాయకులకు కంకర తేలిన రోడ్లు కనిపించడం లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహిస్తు న్నప్పటికీ కాంట్రాక్టర్లు టెండర్లల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం లేదు. దీంతో పనుల్లో ఆలస్యం జరుగుతుంది.

- మొగులయ్య, పంచాయతీరాజ్ ఏఈ



మోడీ పాలనలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలనలో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. ఆదివారం సాయంత్రం మాజీ జెడ్పీటీసీ, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన మహా జన సంపర్క్ అభియాన్ బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకాంక్ష జిల్లాల పథకం ద్వారా దేశంలోని వెనకబడ్డ జిల్లాలు అభివృద్ధి చెందాయన్నారు. ప్రధాన మంత్రి మంత్రులకు, నార్త్ ఈస్ట్ రాష్ట్రాలకు పర్యటనలు చేయాలని ఆదేశించడంతో మంత్రులు అనివార్యంగా పర్యటించారని, దానితో నార్త్ ఈస్ట్ రాష్ట్రాలు అభివృద్ధి చెందాయన్నారు. మోడీ దేశ ప్రజలకు స్వచ్ భారత్ పిలుపు ఇవ్వగా దేశ ప్రజలు అమలు చేశారన్నారు. గ్రామ పంచాయతీలకు నేరుగా 2.5 లక్షల కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. 2014 సంవత్సరం వరకు కేవలం 6వేల గ్రామ పంచాయతీలకు భవనాలు ఉండగా, తర్వాత 30 వేల గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించారన్నారు. జన్ ధన్ అకౌంట్ వల్ల కొత్తగా 49కోట్లు అకౌంట్లు తెరవడం జరిగిందన్నారు. ఇందులో 37 కోట్ల అకౌంట్లను మహిళలు తెరిచి, వీటిలో 2 లక్షల కోట్ల రూపాయలను జమ చేశారని ఇది సంచలనం సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి బాబు మోహన్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జి జయశ్రీ, సహ ఇంచార్జీ అట్లూరి రామక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఇంటికీ మంచి నీరందించిన భగీరథుడు కేసీఆర్

నవతెలంగాణ-పటాన్‌చెరు

రాష్ట్రంలో ప్రతీ ఇంటికి మంచి నీళ్లు అందించిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిట్కుల్ గ్రామ పరిధి వడ్డెరకాలనీలో మంచినీటి దినోత్సవ కార్యక్రమంలో మధు పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు జాతీయస్థాయిలో 2023వ సంవత్సరానికి నేషనల్ వాటర్ అవార్డు వచ్చిందన్నారు. రాష్ట్రంలో బీపీఎల్ కింద ఉన్న కుటుంబాలకు ఒక్క రూపాయికే నల్ల నీటి కనెక్షన్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వందశాతం సురక్షిత నీరు ప్రజలకు అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన నెరవేరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న మంచినీటిని వృధా కాకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కవిత, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి,వార్డు సభ్యులు దుర్గయ్య, కృష్ణ, వెంకటేశ్, భుజంగం,మురళీ,వెంకటేశ్, రాజ్ కుమార్, ఆంజనేయులు, మాజీ నీటిసంఘం అధ్యక్షులు సి హెచ్ వెంకటేష్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఎస్ఎంఆర్ యువ సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దీపిక కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-వట్‌పల్లి

బాసర ట్రిబుల్ ఐటీలో రెండో సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న దీపిక ఈనెల 14న ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం విధితమే. కాగా మృతురాలు దీపిక కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పరామర్శించారు. దీపిక తండ్రి వీరన్నను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీపిక మృతితో కృంగి పోవద్దని ఓదార్పు నిచ్చి ధైర్యం చెప్పాడు.అవసరం ఉన్నప్పుడు తమ వద్దకు వస్తే.. పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చాడు. అనంతరం దీపిక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాల పాట మౌనం పాటించారు. ఆయన వెంట మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అశోక్ గౌడ్, బీఆర్ఎస్ మండలప్రధాన కార్యదర్శి శివాజీ రావు, పత్రి నర్సింలు తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు



నవతెలంగాణ-మునిపల్లి

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథతో ప్రజలకు నీటి కష్టాలు తీర్చి ఇంటింటికి మంచి నీటిని అందిస్తున్నదని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మునిపల్లి మండలం, భూసారెడ్డిపల్లి నీటి శుద్ధి కేంద్రం వద్ద మంచినీళ్ల పండగను ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులు, వివిధ గ్రామాల ప్రజలు, అధికారులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున నీటి శుద్ధి కేంద్రం ను సందర్శించి పరిశీలించారు. అనం తరం అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిషన్ భగీరథకు సంబంధించిన సిడిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల నీటి కష్టాలను తీర్చడానికే తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టి శుద్ధి చేసిన తాగునీరు అందిస్తుందన్నారు. ప్రభుత్వం మహిళల కష్టాలను ఒక్కొక్కటిగా తీర్చుతున్నదన్నారు. మహిళల అండదండలు ప్రభుత్వానికి ఉండాలని కోరారు. సింగూర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం చాలామంది తమ భూములను త్యాగం చేసి అతి పెద్ద ప్రాజెక్టు కట్టుకున్నా.. కండ్లముందే నీళ్లున్నా ఒకప్పుడు ఆ నీటిని వాడుకోలేకపోయామన్నారు. కానీ నేడు మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చి ఇంటింటికి తాగునీరు అందిస్తున్నారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. తాను జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో.. వేసవిలో ఏ గ్రామానికైనా వెళ్లాలంటే ముందుగా ఆ గ్రామంలో నీటి సమస్య ఉందా లేదా తెల్సుకుని.. ఆ తరువాత వెళ్లేవాళ్లమన్నారు. కానీ నేడు ఏ ఒక్క గ్రామంలో నీటి సమస్య లేదన్నారు. జిల్లాలో 943 గ్రామాలకు ఇంటింటికి నల్ల ద్వారా నీళ్లు ఇవ్వడానికి 1688 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ద్వారా రూ.200 కోట్లతో పటాన్చెరువు నియోజకవర్గంలో, 265 కోట్ల వ్యయంతో జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలో ఇంటింటికి తాగునీటి సరఫరా ఇచ్చామన్నారు. జిల్లాలో గతంలో 665 ఓహెచ్ఎస్ఆర్ లు ఉండగా తెలంగాణ ఏర్పడిన తర్వాత అదనంగా 907 నిర్మించారని, ప్రతి ఇంట్లో ప్రతి మనిషికి వంద లీటర్ల చొప్పున తాగు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గతంలో 224 కిలోమీటర్ల పైపులైను ఉంటే, ఈరోజు 3006 కిలోమీటర్ల పైపులైన్లు వేసుకున్నామన్నారు. నల్ల కనెక్షన్లు 21 వేలు ఉంటే, ఇప్పుడు 2.82 లక్షల నల్ల కనెక్షన్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అపర భగీరథుడు కేసీఆర్ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చారన్నారు. త్వరలో సంగమేశ్వర ఎత్తిపోతల ద్వారా కాలువలతో సాగు నీరు వస్తాయన్నారు. జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు మాట్లాడుతూ.. ప్రజలకు ఫ్లోరైడ్ లేని నీటిని అందించాలన్న సీఎం ఆకాంక్షతో మిషన్ భగీరథ తో ఇంటింటికి తాగు నీళ్ళు వచ్చాయన్నారు. అంతకముందు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి మిషన్ భగీరథతో తీరిన నీటి కష్టాలపై తన మనోభావాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, డిఈలు, ఏఈలు, జిల్లా అధికారులు, డిఆర్ఓ, ప్రజాప్రతినిధులు, డీసీసీబీ వైస్ చైర్మెన్ మాణిక్యం, ఆర్డిఓ రవీందర్‌రెడ్డి, మునిపల్లి జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, ఎంపీపీ శైలజ శివశంకర్, సర్పంచ్ స్వప్న శశికుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయి కుమార్, మండలాధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రదాన కార్యదర్శి శశికుమార్, ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



'మంచి నీళ్ల పండుగ'ను నిలదీసిన ప్రజలు

నవతెలంగాణ-ఝరాసంగం

తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ మంచినీళ్ల పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2014 కంటే ముందు, తర్వాత గ్రామాల్లో నీటి పరిస్థితులు ఎలా ఉండేవి అని, గ్రామంలో ఎన్ని నల్ల కలెక్షన్లు ఉన్నాయి? ఇప్పటివరకు మంచినీటికి సంబంధించి ఎంత వ్యాయం చేయడం జరిగింది? అనే రెండు ఫ్లెక్సీలను ఈ ఉత్సవాల్లో ప్రదర్శించారు. అయితే మండలంలోని చాలా గ్రామాల్లో ఇప్పటివరకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్గోయి గ్రామంలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ నీళ్లు రాకున్నా గ్రామంలోని త్రీఫేస్ బోరుబావులతో అనుసంధానం చేసి ట్యాంకులు నింపుతూ నల్లాలకు నీళ్లు వదులుతున్నారు. గత నెల రోజుల నుండి బోరు బావులలో భూగర్భ జలాలు అడుగంటి పోవడం, సరైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో మిషన్ భగీరథ ట్యాంకులు నిండడం లేదని అధికారులు పేర్కొన్నారు. దీంతో నీళ్ల రాకుండానే మంచినీళ్ళ పండగను ఎలా నిర్వహిస్తారని గ్రామంలోని మహిళలు ప్రశ్నించారు. గత నెల రోజుల నుండి అరకొర నీళ్లు వదులుతున్నారని తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపి మంచి నీళ్లను సరఫరా చేయాలని అధికారు లను కోరారు. గ్రామంలోని కొన్ని బోర్ల వద్ద వృథాగా పోతున్నప్పటికీ వాటిని అరికట్టకపోతున్నారని, వాటిని అరికట్టి నీటి కొరత ఉన్న వీధులలోకి మళ్లించాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్, వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్, ఎంపీటీసీ సంగీత గుండప్ప, ఉప సర్పంచ్ సునీత రమేష్, వివోఏలు రాజు, ఫరీనా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో గురుకుల విద్యార్థికి ఆల్ ఇండియా ర్యాంకు



నవతెలంగాణ-జహీరాబాద్

ఐఐటి జేఈఈ 2023 అడ్వాన్స్ ఫలితాల్లో జహీరాబాద్ మండలం అల్గోలు గ్రామంలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర కళాశాల విద్యార్థి విజయ చౌహాన్(H.T : 236161120) 1411 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడని ప్రిన్సిపల్ రాములు తెలిపారు. అత్యుత్తమైన అంకితభావం గల ఉపాధ్యాయుల బృందం ప్రోత్సా హంతో, విద్యార్థి నిరంతర కృషి వల్లనే ఈ ఫలితం సాధ్యమైం దన్నారు. ఈ విజ యానికి కారణమైన బోధన మరియు బోధనేతర బృందాన్ని సంగారెడ్డి జిల్లా ఆర్ఎ లసీ డాక్టర్ డి.నరసింహ అభినందించి హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీ గురు కుల సొసైటీల కార్యదర్శి బి.షఫీ ఉల్లాకి విద్యార్థి, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వరాష్ట్రంలో తాగునీటి కష్టాలకు చెల్లు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గత ప్రభుత్వాల హయాంలో బిందెడు మంచినీటి కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితుల నుండి పొయ్యి కాడికే మంచినీళ్లు అందించిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఆది వారం పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలోని రాఘవేంద్ర కాలనీ, మల్లికార్జున కాలనీ, కావ్య కాలనీలలో ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీటి నల్ల కలెక్షన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెటారన్నారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామి కవాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం 100శాతం విజయం సాధించిందన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి పటాన్ చెరు నియోజకవర్గంలో 10 వేల నల్ల కనెక్షన్లు ఉంటే నేడు 40 వేల కనెక్షన్లు అందిం చామన్నారు. దారిద్య రేఖ దిగువన ఉన్న ప్రజలకు ఒక రూపాయికే నల్ల కనెక్షన్లు అందించే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం నూతన పార్కును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఉప సర్పంచ్ శోభ కృష్ణారెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, గ్రామీణ నీటిపారుదల విభాగం డిఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయ కులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంచినీళ్ల పండుగ



నవతెలంగాణ-సదాశివపేట

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సదాశివపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహిళలు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మహిళలు నీళ్ల బిందెలతో పట్టణ విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు బిందెడు నీళ్ల కోసం కులాయిలు చేతిపంపుల వద్ద ఒక యుద్ధమే జరిగేదని, నేడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి శుద్ధ జలాలు సరఫరా అవుతుండడంతో ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పాయన్నారు. ఏ ఒక్క ఆడబిడ్డ బిందెలు పట్టుకొని నీటికోసం రోడ్డు పైకి రావొద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. సదాశివపేట పట్టణంలో రూ.44.60 కోట్లతో 140 కిలోమీటర్‌ల పైప్‌లైన్ ద్వారా మిషన్ భగీరథ మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

ఘనంగా మఠం బిక్షపతి జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-జోగిపేట

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి మఠం బిక్షపతి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్‌లో రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిసింది. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ నివాసంలో కేక్‌కట్ చేయిం చి, శాలువా పూలమాలతో సన్మానించారు. మంత్రి, ఎంపీలు బిక్షపతికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం సంగారెడ్డిలోని బిక్షపతి నివాసంలో నిర్వహిం చిన వేడుకల్లో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అందోల్ నియోజకవర్గం లోని బీఆర్ఎస్ నాయకులు, జాగృతి నాయకులు, బిక్షపతి యువసేన నాయకులు కేక్ కట్ చేయించి, శాలువా పూలమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. బిక్షపతి అంచలంచెలుగా ఎదుగుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపా రు. సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా చేపడు తున్న కార్యక్రమాలను అభినందించారు. జన్మదిన శుభాకాం క్షలు తెలిపిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు, అభిమానులకు బిక్షపతి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జిన్నారానికి ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-జిన్నారం

నేడు(సోమవారం) పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మండలంలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నాయికోటి రాజేష్ తెలిపారు. ఉదయం 11:00 గంటలకు గడ్డపోతారం గ్రామపంచాయతీ కిష్టయ్యపల్లి లో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఉదయం 11:30 గంటలకు నల్తూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 12:00 గంటలకు జిన్నారం లో స్కూల్ బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్‌లు ఎమ్మెల్యే వెంట పాల్గొంటారన్నారు.

నార్సింగి గ్రామ ఎస్టీ కమిటీల నియామకం



నవతెలంగాణ-నార్సింగి

పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు నార్సింగి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు ఆధ్వర్యంలో నార్సింగి గ్రామ ఎస్.టీ కమిటీ నియామకం జరిగింది. గ్రామ ఎస్టి కమిటీ అధ్యక్షుడిగా కూరాకుల యాదగిరిని ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా కూరాకుల కనకయ్య, కూరాకుల రాజు, ప్రధాన కార్యదర్శిగా కూరాకుల పెద్ద పోచయ్యను, కార్యదర్శులుగా కోనేరు నర్సింహులు, కురాకుల పెద్ద భూమయ్యలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా కూరాకుల ఎల్లయ్య, రాములు, పెద్ద మైసయ్య, చిన్న పోశయ్య, చిన్న మైసయ్య, మల్లయ్య, చిన్న మల్లయ్య, సుధాకర్, నాగరాజు కురాకుల ఉప్పలయ్యలను నియమించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బాబు నూతన కమిటీ కార్యవర్గాన్ని, సభ్యులను అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అందరితో కలిసి పనిచేయాలని, బీ.ఆర్.ఎస్ పార్టీ విజయానికి తమ వంతు కృషి చేయాలని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగుర వేయాలన్నారు.


నవతెలంగాణ
మెదక్
సోమవారం 19 జూన్ 2023

దశాబ్ది ఉత్సవాల్లో జర్నలిస్టుల స్థానం ఎక్కడ?

- జర్నలిస్టులపై చిన్న చూపు ఎలా
- ఉద్యమంలో వాడుకున్నారు ఉత్సవాల్లో మరిచారు

నవతెలంగాణ-రేగోడ్

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులపై ప్రభుత్వం చిన్న చూపు చూడడం ఎంత వరకు సమంజసమని మెదక్ జిల్లా రెగోడ్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శంకర్ గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహిస్తున్న దశాబ్ది వారోత్సవాల్లో జర్నలిస్టులను గుర్తించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వనికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి తమ వార్తల ద్వారా మార్గం చూపిస్తున్న జర్నలిస్టులను మరిచిపోవడం సిగ్గు చేటన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ కోసం ఎంతో పోరాడిన జర్నలిస్టులను దశాబ్ది ఉత్సవాల్లో స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. సమాజంలో నాలుగో స్థంభం అయిన జర్నలిస్టులను గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. జర్నలిస్టులను మరిచిన ఏ పార్టీలు మనుగడ సాధించలేవని, ఇది గుర్తుంచుకుంటే అందరికీ మంచిదని, ముందుంది ముసళ్ల పండుగని అన్నారు.

మున్నూరుకాపు సంఘం గట్టమ్మబస్తీ యువకమండలి నూతన కార్యవర్గం ఎన్నిక



నవ తెలంగాణ-మెదక్‌టౌన్

మెదక్ పట్టణంలోని మున్నూరుకాపు యువక మండలి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రెసిడెంట్ బట్టి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం గట్టమ్మ బస్తీ యువక మండలి అధ్యక్షులుగా కొంగోటి మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొంగోటి నరేష్, కోశాధికారిగా నింగమయ్యల కిరణ్, సలహాదారులుగా మహేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బట్టి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరు కాపు యువకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని గ్రామాల్లో నూతన కార్యవర్గాలను ఎర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. మున్నూరుకాపు సంఘం పటిష్టత, అవసరాల కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా యువక మండలి ప్రెసిడెంట్ బోనగిరి శేఖర్, మెదక్ టౌన్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు గట్టేష్, గట్టమ్మ బస్తీ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మల్లేష్, మన్నె కిషన్, నింగమయ్యల మల్లేష్, ఎల్లేష్, భూషణం, ప్రసాద్, మహిపాల్, ప్రశాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-నిజాంపేట

మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చైర్మెన్ మైనంపల్లి రోహిత్ సహకారంతో మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయశారు. నిజాంపేట మండల మైనంపల్లి యువసేన నాయకులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, జాల శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను పెంచినందున సామాన్యులకు అందుబాటులో లేకుండా చేయడం వలన మైనంపల్లి సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ వారు నిత్యావసర సరుకులు బియ్యం పప్పులు, ఉప్పులు, చింతపండు, ఖర్జూర పండ్లు, చక్కెరలను పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మన శ్రీనివాస్, నాలం స్వామి గౌడ్, కనకరాజు, వినయ్ కుమార్, బుచ్చయ్య, మహేష్, ఎల్లం మహేష్, బిక్షపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాస్తూ బీఆర్ఎస్ కార్యకర్త మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-హవేలీఘనపూర్

హవేలిఘనపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మూగ ఏసు రాజు శనివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడు. ఈ విషయం నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఆదివారం హవేలిఘనాపూర్ గ్రామానికి చేరుకొని మూగ యేసు రాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి భార్య రాధికను ఓదార్చారు. మూగ ఏసు రాజు కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. తక్షణ ఆర్థిక సాయం కింద అంత్యక్రియలకు రూ.10 వేలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మేకల సాయిలు, రామచంద్ర రెడ్డి, కో ఆప్షన్ మెంబర్. కాలేద్, పిఎసిఎస్ డైరెక్టర్ సిద్ధిరాంరెడ్డి గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

టీపీసీసీ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ-వెల్దుర్తి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మండల పరిధిలో పెద్దాపూర్ హస్తల్పూర్ గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. పెద్దాపూర్ గ్రామంలో దాసరి నర్సమ్మ చిప్ప శీను తమకి ఇల్లు లేవని రాజిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తదనంతరం గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు 150 మంది, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా రాజిరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నరసింహ రెడ్డి, వైఎస్ ఎంపిపి సుధాకర్ గౌడ్,సెల్ కార్యదర్శి తలారి మల్లేశం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రియాజ్ అలీ, నంబూరు గుప్త, పి ఎస్ సి ఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్, కృష్ణ, జగ్గ శంకరయ్య, వెంకటరెడ్డి, శ్రీశైలం, సత్తయ్య గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలువురు బాధితులను పరామర్శించిన కత్తి కార్తీక





నవతెలంగాణ-నార్సింగి

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ నార్సింగి మండల కేంద్రంలో పలువురిని పరామర్శించారు. న్యూయార్క్‌లో జరిగిన 'ఇంటరాక్షన్ విత్ రాహుల్ గాంధీ' కార్యక్రమంలో పాల్గొని తిరిగి స్వదేశం చేరుకున్న వెంటనే నియోజకవర్గంలోని బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి పర్యటన చేపట్టారు. ఇటీవల మృతి చెందిన పొడాల అశోక్ (30), ఎం.డీ. జావిద్ (30)ల కుటుంబ సభ్యులను, పక్షపాతంతో బాధ పడుతున్న జమ్మిచెట్టు నారాయణ (70)ను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా కత్తి కార్తీక గౌడ్ బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా కల్పించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మైలారం రవీందర్, మైనారిటీ అధ్యక్షుడు ఖుర్షీద్ ఖాన్, కాశబోయిన శ్రీనివాస్, తిమ్మక్కపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాములు గౌడ్, గజ్వేల్ పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఎం.డీ అస్గర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త దేవి రెడ్డి, మిద్దె భూపాల్ గౌడ్, ఐరేని సాయితేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంచినీళ్ల పండుగ









నవతెలంగాణ-నార్సింగి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో మంచి నీళ్ళ పండుగను ఘనంగా నిర్వహించారు. నార్సింగి సర్పంచ్ ఎర్రం అశోక్ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ సబితా రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ఐదుగురు విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ స్వప్న విద్యుత్తుతో ప్రయోగం చేసి మిషన్ భగీరథ నీటి స్వచ్ఛతను, ఆర్.ఓ నీటిలో కరిగిపోయే లవణాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎంపీపీ సబిత మాట్లాడుతూ రాష్ట్ర సాధన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ఇంటింటికి నల్లాల ద్వారా నీళ్ళు అందిస్తూ ఆడబిడ్డలకు నీటి కష్టాలను లేకుండా చేశారన్నారు. సమైక్య రాష్ట్రంలో పడిన నీటి కష్టాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. గోదావరి, కృష్ణా నీటితో ఆడపడుచుల పాదాలు కడుగుతానన్న మాటను నిలబెట్టుకున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం వాటర్ లైన్‌మెన్‌లకు శాలువాలతో సన్మానించారు. అనంతరం 'మిషన్ భగీరథ నీళ్ళు ముద్దు, ఫిల్టర్ నీళ్ళు వద్దు' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ, ఎంపిఓ సతీష్, ఈఓ వెంకటేష్, ఐకేపీ సీసీ శంకర్ పంచాయితీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాశ్య తాండాలో ..

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నార్సింగి మండలం జప్తి శివునూర్ గ్రామం కాశ్య తండాలో మంచి నీళ్ళ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జప్తీ శివునుర్ గ్రామ సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంచి నీళ్ల ఉత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామ సభ, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన ఇద్దరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాటర్ మెన్‌లకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జప్తీ శివునుర్ గ్రామ సర్పంచ్ షరీఫ్ షేక్, వైస్ ఎంపిపి సుజాత, స్పెషల్ ఆఫీసర్ విజృంభణ, వార్డ్ మెంబర్ సునీత మహేందర్, పంచాయితీ కార్యదర్శి రాజు, పీ.ఏ.సీ.ఎస్ డైరెక్టర్ రామచంద్ర, వాటర్ మేన్ శ్రీకాంత్, శ్రీనివాస్ గ్రామ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ (కె) గ్రామాలలో నీళ్ల పండుగ దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించి తెలంగాణ రాకముందు తెలంగాణ వచ్చిన తర్వాత నీళ్ల పరిస్థితి ఎలా ఉండేదో వాటి స్థితిగతులను గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామ వాటర్ మెన్‌లను సన్మానించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, గ్రామ సర్పంచులు నిజాంపేట సర్పంచ్ అనూష, కె వెంకటాపూర్ సర్పంచ్ అనిల్ కుమార్, నిజాంపేట ఎంపీటీసీలు లహరి రెడ్డి. వెంకటాపూర్ ఎంపీటీసీ, భాగ్యలక్ష్మి, కార్యదర్శులు నర్సింలు, ప్రేమలత, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, ప్రభాకర్ రెడ్డి, గ్రామస్తులు రాజేందర్, పెంటయ్య, నవీన్, సిద్ద రాములు, దేవుని రాజు, ప్రశాంత్, తాడెంమహేష్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వివోఏలు, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-రేగోడు

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నుంచి గాంధీ చౌక్ వరకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు అంగన్వాడి కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి మంచినీళ్ల పండుగ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈ విజయభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి పరిశుభ్రమైన మిషన్ భగీరథ నీటిని అందిస్తుందన్నారు. గతంలో నీటి కోసం మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారని తెలిపారు. ఇప్పుడు నీటి కోసం ఇబ్బందులు పడే సమస్యనే లేదని తెలిపారు. ఆర్వో నీరు వద్దు భగీరథ నీరే ముద్దు అని తెలిపారు. అనంతరం సమావేశం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ నర్సింలు, ఉపాధి హామి సిబ్బంది జగదీష్, కార్యదర్శి రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ మెదక్ ల్యాబ్ టెక్నికల్ శివ రమేష్, అంగన్వాడి, ఐకెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో హోవనం

- అధిక సంఖ్యలో హాజరైన అమ్మవారి భక్తులు
- శక్తిపీఠంలో పూజలు నిర్వహించిన రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ దంపతులు
- ప్రత్యేక పూజలలో పాల్గొన్న హైకోర్టు న్యాయవాది శివకుమార్ గౌడ్, చాగన్ల నరేంద్రనాథ్



నవతెలంగాణ-నర్సాపూర్

శివ్వంపేట మండల కేంద్రంలో అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ సంకల్ప బలంతో, బగలాముఖీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అత్యంత శక్తిపీఠాలలో ఒకటయిన శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి హరిద్రార్చన, అభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమావాస్య పర్వదినం సందర్భంగా హోవనము అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ఉమ్మడి మెదక్ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉపాసకులు మాట్లాడుతూ స్థంభన దేవత శ్రీబగలాముఖీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల మన ఎదుగుదలను చూసి ఎవరైతే కీడును కోరతారో, వారే మనం బాగుండాలని మన మేలు కోరేలా చేస్తారన్నారు. బగలాముఖీ అమ్మవారు మన శత్రువు నాలుకను పట్టుకుని కీడును కోరే మాటలను స్తంబింపజేస్తుందన్నారు.

బగలాముఖీ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీబగలాముఖీ అమ్మవారి ప్రత్యేక పూజలు, అమావాస్య హోవనములో రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ దంపతులు పాల్గొని అమ్మవారి దర్శన భాగ్యం పొందారు. ప్రత్యేక పూజలలో హైకోర్టు న్యాయవాది, బగలాముఖీ ట్రస్ట్ సభ్యులు జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్, చాగన్ల నరేంద్రనాథ్, పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

తండాలను పంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్‌దే

- 9 గ్రామ పంచాయతీలకు శంకు స్థాపన చేసిన ఎమ్మెల్యే
- త్వరలోనే ఇల్లు కట్టుకోవడానికి రూ. 3 లక్షలు



నవతెలంగాణ-చిలిపిచేడ్

గ్రామపంచాయతీలతోనే అభివృద్ధి సాధ్యమని తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కేసిఆర్‌దేనని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి అన్నారు. ఆదివారం చిలిపిచేడ్ మండలంలో సుడిగాలి పర్యటన చేసి రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తొమ్మిది గ్రామపంచాయతీలకు శంకుస్థాపన చేశారు. శిలంపల్లి, సామలతండా, చిలిపిచేడ్, గౌతాపూర్, గన్యాతండా, గుజిరి తండా, చిట్కుల్, గ్రామపంచాయతీలలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపల్లెలో సీసీ రోడ్డు వేశామని ప్రస్తుతం ఎక్కడ ఖాళీ లేకుండా సీసీ రోడ్లు వేశామని, డ్రైనేజీలు నిర్మించామని మరెన్నో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి పల్లెకు తాగునీరు అందిస్తున్నామని ఎండాకాలంలో నీళ్ల ఇబ్బంది లేకుండా గ్రామాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు. త్వరలోనే నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మూడు లక్షల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని లబ్ధిదారులు సొంత స్థలాలలో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఎంపీపీ వినోద, వైస్ ఎంపీపీ విశ్వంబర్, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీ దుర్గ రెడ్డి, ఎంపీటీసీలు సుభాష్ రెడ్డి, శాంతి, సర్పంచులు మంతప్ప, రాకేష్, గోపాల్ రెడ్డి, రాతల శంకర్, స్వరూప, అన్ని బిక్షపతి, కవిత, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, మాణిక్ రెడ్డి, ఎంసి విట్టల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పార్మాస్యుటికల్ కాలేజీలో క్యాంపస్ సెలక్షన్స్

- హెటిరో ల్యాబ్ ఆధ్వర్యంలో బీపార్మసి విద్యార్థుల ఎంపికలు



నవతెలంగాణ-నర్సాపూర్

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామ శివారులో గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ సైన్స్ కాలేజీలో, హెటిరో కంపెనీ ల్యాబ్ యూనిట్ 5 ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. కాలేజీలో బీఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ కళాశాల విద్యార్థులే కాకుండా ఇతర కాలేజీలకు చెందిన వారు మొత్తం 75 మంది పాల్గొన్నారు.ఈ ఎంపికలలో 38 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెటిరో సంస్థ ఏజీఎం, ఎచ్ఆర్ టీమ్, గ్లాండ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ప్లేస్ మెంట్ ఆఫీసర్లు, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవ తెలంగాణ -దౌల్తాబాద్

అకాల వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతులను పప్రభుత్వమే ఆదుకోవాలని సాగు పంటలు, ధరణి బాధితుల వేదక నాయకులు మల్లేశం డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో సాగు పంటలు, ధరణి బాధితుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కురిసిన అకాల వడగండ్ల వానలతో రైతాంగం పూర్తిగా నష్ట పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. అరకొర ధాన్యం ఉన్నాగానీ, పౌర సరఫరాల శాఖ రైతాంగాన్ని చిన్న చూపు చూస్తూ మిల్లర్లకు దోస్తానా అందిస్తూ ధాన్యం తూకంలో కోతలు విధిస్తుందన్నారు. తూకం ద్వారా కూడా రైతాంగం చాలా నష్ట పోతుందన్నారు. మరోవైపు ధాన్యం కాంట అయినా లారీల కోసం పడిగాపులు పడాల్సి వస్తుందన్నారు. మరో పక్క ధాన్యం మిల్లర్లకు చేరినా రోజులు గడుస్తున్నగానీ పంట డబ్బులు రాలేక పోతున్నాయన్నారు. ఇలా ప్రభుత్వం రైతాంగం విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రైతాంగానికి మరో పెద్ద సమస్య ధరణి పోర్టల్, ఇది ఉన్నోడికి లాభం చేకూరుస్తుందని, పేదోడి నడ్డిని విరుస్తుందన్నారు. భూములను ధరణి పోర్టల్‌కు అనుసంధానం చేసి పల్లెపల్లెలో తగాదాలకు కారణమవుతుందన్నారు. భూములను ఎవరెవరో పేరు మీదకు మారుస్తుంది. ఎండ్లకు ఎండ్లు ఊరు వదిలి పోయిన వాళ్లు వాళ్ల పేర్ల మీద భూములను చుయిస్తుందన్నారు. ఏండ్ల తరబడి సాగు చేస్తున్న వాళ్ల పేరు మీద సెంటు భూమి లేకుండా చేస్తుందన్నారు. ప్రభుత్వాలు చెపుతున్న ఈజీ ఆఫ్ డూయింగ్ అంటే పేదోడి భూములను లాక్కొని పెద్దోళ్లకు పంచడమేనా..? ఇదేనా ప్రభుత్వ పాలసీ అని నిలదీశారు. భూములను అప్పనంగా కార్పొరేట్ కంపెనీలకు దారా దత్తం చేయడంకోసమే ఈ ధరణి పోర్టల్ అన్నారు. ధరణి పోర్టల్ ఒక సమస్యగా మారిందన్నారు. పేదల బతుకును చిదిమేసే కుట్రలకు వ్యతిరేకంగా, నష్ట పోయిన రైతాంగాన్ని తక్షణమే ప్రభుత్వమే అదుకునే వరకు, ధరణి పోర్టల్‌ను వెంటనే రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, గిరి, కనకయ్య, యాదగిరి, గోపి, రాజు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కలియుగ భగీరథుడు సీఎం కేసీఆర్

- తలదించుకున్న పాలన నుంచి తల ఎత్తుకునేలా
- పోరాటస్పూర్తితో రాష్ట్ర అభివృద్ధి
- నీటి పండుగలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్



నవతెలంగాణ-కొండపాక

సాగు తాగు నీటి కోసం ఎన్నో తిప్పలు పడ్డ ప్రజల కష్టాలు తీర్చడానికి ప్రాజెక్టులు నిర్మించి దేశం గర్వించేలా నీటిని అందించిన సీఎం కేసీఆర్ కలియుగ భగీరథుడని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా కుకునూరు పల్లి మండలం మంగోల్ శివారులోని నీటి శుద్ధి కేంద్రం వద్ద ఆదివారం నీటి పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గొంగడి సునీత చేర్యాల ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తోపాటు పలు నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ప్రజలు మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్న నీటి పండుగ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమైక్య పాలనలో చుట్టాలు ఇంటికి వస్తే తాగేందుకు మంచినీళ్ళు ఇవ్వలేని దీన స్థితి నుంచి మిషన్ భగీరథ కార్యక్రమంలో నల్లాల ద్వారా ఇంటింటికి త్రాగునీరు అందించిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ప్రతి నీటి బొట్టులో కేసీఆర్ రూపంను చూస్తున్నామన్నారు. ఎండాకాలం వచ్చిందంటే నీటి కోసం బిందెలు పట్టుకొని పెళ్లి తెచ్చుకున్న కష్టాలు ఎన్నో తెలుసునని వాటన్నింటినీ ప్రాజెక్టుల రీ డిజైన్ చేసి తాగు సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ప్రభుత్వ కృషికి అనేక జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. సమైక్య పాలనలో తలదించుకున్నామని, తెలంగాణ ఏర్పడిన తర్వాత తల ఎత్తుకునేలా సీఎం పాలన జరిగిందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గొంగడి సునీత అన్నారు . త్రాగునీరు ఎక్కడి నుంచి వస్తుందో తమ ప్రాంత ప్రజలకు చూపించేందుకే మంత్రి హరీశ్‌రావు సూచనతో మంగోల్ వచ్చామన్నారు.

ప్రపంచానికి తెలంగాణ ఆదర్శం


తెలంగాణ రాష్ట్రంలోని అభివృద్ధి పనులు దేశానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. ఒక్క నెత్తురు చుక్క రాలకుండా తెలంగాను తెచ్చిన అపర గాంధీ కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రలవాళ్లు కేసీఆర్ ను ఆహ్వానిస్తున్నారన్నారు. ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చే పథకాలు ఇంటింటికి చేరాయన్నారు. ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ ఆగు సాగునీరు కష్టాలు తీర్చి ఎప్పటికీ గుర్తుండేలా పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు.

ఇదంతా సీఎం కేసీఆర్ చలువే

గ్రామీణ భారత్‌లో అతిపెద్ద నీటి శుద్ధికరణ ప్లాంట్ మంగోల్‌లో ఏర్పాటు చేయడం సీఎం చలువేనని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. అందరు సందర్శించి దీని గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల రైతుబంధు కన్వీనర్ రజిత, సర్పంచ్ కిరణ్ కుమార్ తదితరులు మాట్లాడారు. గజ్వేల్ ఆలేరు, జనగామ నియోజకవర్గాల ప్రజలు ప్రజాప్రతినిధులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.



తోటి కార్మికునికి అండగా భవన నిర్మాణ కార్మికులు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలోని పలుగుగడ్డ గ్రామానికి చెందిన గువ్వ కుమార్ మూడు రోజుల క్రితం అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా ఆదివారం తోటి భవన నిర్మాణ కార్మికులు అందరూ కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆ కుటుంబానికి మేమున్నామంటూ రూ.17 వేల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి మిత్రులు కుమార్ మృతి చెందడం చాలా బాధాకంమన్నారు. వారి కుటుంబానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎల్లేష్, గ్రామ అధ్యక్షులు కనకయ్య, కార్మికులు రవి, సుధాకర్, ఆంజనేయులు, నాగరాజు, రామచంద్రం, తిరుపతి, సాయిరాం, వెంకటేష్, కృష్ణ, రమేష్, వెంకట్‌లు ఉన్నారు.



దివ్యాంగులకు రెండు ఏళ్ల రెన్యూవల్ సిస్టం తీసివేయాలి

- నిజమైన దివ్యాంగులకు లైఫ్ లాంగ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి
- దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

దివ్యాంగులకు సదరం క్యాంపులో ఇచ్చిన సర్టిఫికెట్లపై రెండు సంవత్సరాలకు ఒకసారి ఉన్న రెన్యూవల్ సిస్టం ఎత్తివేయాలని దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం జిల్లా అధ్యక్షులు కేమ్మసారం అశోక్ అన్నారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలలో వికలాంగులు సకలాంగులు అవుతారా? రెండు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సర్టిఫికెట్ రెన్యూవల్ చేయించుకోవడానికి వెళ్లినప్పుడు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, రెన్యూవల్ కావడానికి రెండు మూడు నెలలు పట్టడంతో ఈ మూడు నెలల కాలం పెన్షన్ కూడా చేతికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన వికలాంగులను గుర్తించి శాశ్వత లైఫ్ లాంగ్ సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు రూ.లక్ష స్కీమును వర్తింపజేస్తే బతుకుతెరువు ఉంటుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ కార్డులు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. అర్హులైన నిజమైన దివ్యాంగులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. పుట్టుక నుంచి దివ్యాంగులైన వారికి కూడా



గతంలో పెన్షన్ పొందిన వారిని కూడా సదరం క్యాంపులో శాతం పేరిట తొలగించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలని, రెండు సంవత్సరాల రెన్యూవల్ సిస్టం పూర్తిగా ఎత్తివేయాలన్నారు. సమావేశంలో దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు స్వరూప, సభ్యులు సంసన్, సత్యనారాయణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహానిధి పేదలకు వరం



నవ తెలంగాణ- గజ్వేల్

సీఎం సహా నిధి పేదలకు వరంగా మారిందని గజ్వేల్ మండలం కోలుగూరు ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి అన్నారు. ఆదివారం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సహకారంతో కొల్గురు గ్రామానికి చెందిన నిమ్మరాజ్ ఆదిత్యకు రూ.17,500, అయిల నరేష్‌కు రూ.22 వేల చెక్కులను కొల్గురు ఎంపీటీసీ జ్యోతి స్వామి ఆధ్వర్యంలో అందజేశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్కులు పేద ప్రజలకు వరం అని ఎంపీటీసీ జ్యోతి స్వామి అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్ రావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల బిసిసెల్ అధ్యక్షులు పురం ఆంజనేయులు గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి నరేష్ గౌడ్,గ్రామ వార్డు మెంబెర్ దామగాళ్ల ప్రభాకర్,పురం గణేష్,గజ్వేల్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బండారి సంపత్, గ్రామ సీనియర్ నాయకులు పడిగే గలయ్య, మన్నె బాలరాజ్, మంగలి మల్లేశం, బండారి యాదయ్య పాల్గొన్నారు.

తండ్రి కొడుకుల చిత్రాన్ని ఆవాలతో చిత్రీకరణ



నవ తెలంగాణ- గజ్వేల్

పితృ దినోత్సవాన్ని పురస్కరించుకుని తండ్రి తన భుజాలపై కొడుకును ఎత్తుకునే చిత్రాన్ని ఆవాలతో అద్భుతంగా చిత్రించి ఆదివారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు రామకోటి రామరాజు చిత్రీకరించారు. గెలిచినప్పుడు పది మందికి ఆనందంగా చెప్పుకునే వ్యక్తి, ఒడినప్పుడు తన భుజాలపై తట్టి గెలుస్తావులే అని ధైర్యంచెప్పి హత్తుకునే మనిషి నాన్న అని అన్నారు. తన జీవితాన్ని ధారపోసి కొడుకులను ప్రయోజకున్ని చేసేది తండ్రి ఒక్కరే అన్నారు.

టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లుకు మాతృవియోగం



నవ తెలంగాణ - సిద్దిపేట

టీఎస్ఐఐసి చైర్మన్ గ్యాదరి బాలమల్లు తల్లి కమలమ్మ ఆదివారం సిద్దిపేటలోని తన నివాసంలో పరమపదించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు కమలమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. సిద్ది పేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్లు, నాయకులు, ఆమె మృతదేహానికి నివాళులర్పించి , కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గోశాల ప్రారంభోత్సవం



నవ తెలంగాణ - సిద్దిపేట

పారిపల్లి వీధిలో గల శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయ పక్కన గోశాలను కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి చేతులమీదుగా ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయం పక్కన 250 గజాల స్థలాన్ని సేకరించి భక్తులందరూ కలిసి ఒక కమిటీగా ఏర్పడి గోషాలను నిర్మించి, శ్రీ రామరాజు రావిచెట్టు హనుమాన్ గోశాలగా నామకరణం చేశారు. ఆదివారం కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెరుగు రాజనర్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలో ఎన్నో దేవాలయాలు ఉన్నాయని, దేవాలయాల అభివృద్ధికి మంత్రి హరీశ్ రావు ఎంతో కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వైద్య కృష్ణమాచార్యులు, అనిల్ శ్రీను, ఇల్లెందుల రాజశేఖర్ ,అయిత రామకృష్ణ ,నాగరాజు ,సోమ శ్రీకాంత్ , జిల్లా శ్రీనివాసు, బచ్చు రమేష్, మేర సత్తయ్య ,ఊదర మణిదీప్ రెడ్డి, తిప్పరాజు మధు పాల్గొన్నారు.

ఎస్ఐకి శుభాకాంక్షలు



నవతెలంగాణ-తొగుట

మిరుదొడ్డి ఎస్ఐ పల్లె శ్రీధర్‌గౌడ్‌కు సీఐగా పదోన్నతి రావడంతో ఆదివారం గుడికందుల గ్రామస్తులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ దూలం బైరాగౌడ్, సర్పంచ్ గంగని గళ్ళ మల్లయ్య ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూల బొకే అందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తొగుట మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మండల యూత్ నాయకులు చింత బైరా రెడ్డి,సురేష్ గౌడ్,గుడికం దుల గ్రామ యూత్ నాయకులు ప్రవీణ్, కమలా కర్ తదితరులు ఉన్నారు.

గ్రామాలలో తాగునీటి సంబరాలు

















నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పందిల్ల, గాంధీనగర్, మాలపల్లి, తోటపల్లి, మీర్జాపూర్, వంగరామయ్యపల్లి, జిల్లాల గడ్డ, పోతారం ఎస్, నాగారం, రాములపల్లి, మడద, పొట్లపల్లి, కుచనపల్లి తో పాటు పలు గ్రామాలలో ఆదివారం సర్పంచ్ లు తాగునీటి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద తాగునీటి పై అవగాహన, గ్రామంలో ర్యాలీ, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకర్ ల వద్ద ముగ్గులు వేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ మంచినీళ్ల పండుగ నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆయా గ్రామ పంచాయతీ నుండి మహిళలు ర్యాలీ చేపట్టారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు నివేదిక చదివి గ్రామ పంచాయతీల వద్ద నీటి సంరక్షణపై మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు.మిషన్ భగీరథ సూపర్ వైజర్, వాటర్ మెన్ లను సన్మానించారు.నంగునూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి,మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు చౌడుచెర్ల జయపాల్ రెడ్డి, ఎంపీటీసీ కోల సునీత మహేందర్ గౌడ్, సోసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎం.డీ.రహీం పాషా,న్యాయవాది సిరికొండ మణి, మిషన్ భగీరథ ఏఈ నర్సింగారావు, శ్యామ్,బీఆర్ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండల వ్యాప్తంగా ఆదివారం మంచి నీళ్ల పండుగను సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ నాడు పొద్దున లేవగానే నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి అనంతరం మిషన్ భగీరథ నీటితో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.సీఎం కేసీఆర్ తాగు, సాగు నీటి కోసం శాశ్వత పరిష్కారం చేశారని హర్షం వ్యక్తం. ప్రతి ఇంటికి తాగునీరు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ తోనే సాధ్యమైందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామలల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి సర్పంచ్ బహుమతులు ప్రదానం చేశారు. గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని విడుదల చేసే గ్రామ పంచాయతీ వాటర్ మెన్ సన్మానం చేసి షీల్డు అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు,ఎంపీటీసీ, ఉప సర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ, ఆశాలు,మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మర్కుక్ మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలలో జల దినోత్సవ వేడుకలను ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఆదివారం మంచి నీళ్ల పండుగ సంబురాలు ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో నిర్వహించిన మంచి నీళ్ల పండుగ సంబురాల ర్యాలీలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. సర్పంచ్ టేకు తిరుపతి,వార్డ్ సభ్యులు, గ్రామస్తులు హజరయ్యారు.

నవ తెలంగాణ -దౌల్తాబాద్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో నీళ్ల పండగ పురస్కరించుకొని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఏఈ సాయి కృష్ణ మాట్లాడుతూ ఫిల్టర్ వాటర్ తాగడం మూలంగా వచ్చే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ మంచినీటి ద్వారా జరిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మెరుగు యాదగిరి వార్డు సభ్యులు మాశెట్టి నరేష్ గుప్తా, వ్యవసాయ మార్కెట్ సభ్యులు నాగరాజు, తాజా మాజీ సర్పంచ్ అది వేణుగోపాల్, ఫీల్డ అసిస్టెంట్ శివకుమార్, ఆశ వర్కర్ బాలమణి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువతకు అన్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు

నవ తెలంగాణ - సిద్దిపేట

పదేళ్ల పాలనలో యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు మండిపడ్డారు. సిద్దిపేటలో ఆదివారం తాడూరి బాలా గౌడ్ ఫంక్షన్ హాల్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ డిక్లరేషన్ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి కల్పనకై ఉద్యోగాలు ప్రకటిస్తామని చెప్పి, మోసం చేశారని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి మాట మార్చారని మండిపడ్డారు. ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మోదీ, కేసీఆర్ లకు వచ్చే ఎన్నికల్లో యువతి, యువకులు సరైన గుణపాఠం చెప్పాలని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రోజు రోజుకు మహిళలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. వాటిని అరికట్టడంలో పోలీసులు కూడా విఫలమయ్యారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని , మహిళలకు పెద్దపీట వేయనున్నారని అన్నారు. అంతే కాకుండా మహిళలకు రూ 500 కే గ్యాస్



అందజేస్తామని, యువతులు, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం లాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెడతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూత్ డిక్లరేషన్ కార్యక్రమంలో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండపాక ఎంపిటిసి వీరుపాక ప్రణవి, మహిళా జనరల్ సెక్రెటరీ రజిత, కొండల్ రెడ్డి , పట్టణ అధ్యక్షులు ఇమామ్, స్రవంతి, నరసవ్వ, కమలవ్వ లక్ష్మీ, విజయ, షర్మిల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో వాడవాడలా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు









నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి జన్మదిన వేడుకలను వాడ వాడలా నిర్వహించారు. ఆదివారం మొత్తం 20 వార్డులలో వైశ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చైర్మన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేయించారు. మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి ప్రాతినిధ్య వహిస్తున్న మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డులో ప్రజలు స్థానిక వెంకటేశ్వర, షిరిడి సాయిబాబా, అయ్యప్ప, హనుమాన్ ఇతర దేవాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర దేవాలయంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక జి డి ఆర్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు పేదలు వైద్య శిబిరానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్థానిక ఇంద్ర పార్క్ వద్ద లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వరంలో అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఉదయం నుండే మున్సిపల్ చైర్మన్ ఇంటి వద్ద జన్మ దిన వేడుకల సందడి కనిపించింది. ఆయన కుమారుడు ఐ ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ ఆధ్వర్యంలో క్రీడా స్టేడియంలో క్రీడాకారులకు వాలీబాల్ ,క్రికెట్, కోకో తదితర క్రీడలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. క్రీడల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి జన్మదిన సందర్భంగా పలుచోట్ల విషెస్ చెప్పే విధంగా భారీ కట్ అవుట్లను ఏర్పాటు చేశారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో దేవాలయ నిర్వాహకులు బుక్క రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఐ ఈఎఫ్ కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమాలు అన్ని వార్డులో నిర్వహించారు. ఇందులో బాగానే మున్సిపల్ చైర్మన్ కు వైస్ చైర్మన్ జకీర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు రాజు, ఇస్మాయిల్, ఉమర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. మీడియా ప్రతినిధులు శాలువాతో మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి నీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయిని యాదగిరి, గుడాల శేఖర్, ప్రభాకర్, లింగం తదితరులు ఉన్నారు. వ్యాపారులు, వైద్యులు, అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు మున్సిపల్ చైర్మన్ కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పి ఆర్ టి యు గజ్వేల్ మండల శాఖ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతి రాజమౌళి పుట్టినరోజు శుభాకాంక్షలు గజ్వేల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఊడెం వేమారెడ్డి, టి. లింగం గౌడ్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి రామకృష్ణారెడ్డి రాష్ట్ర కార్యదర్శి బాలు చరణ్ సత్యనారాయణ రెడ్డి, భాస్కర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సిహెచ్ నాగరాజు, జిల్లా కార్యదర్శి పి వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడంలో తన కుమారుడు సంతోష్, బి ఆర్ ఎస్ పార్టీ యువ నేత మాదాడి వినయ్ రెడ్డి కృషి చేశారు.

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కృషి

మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి

నవతెలంగాణ- గజ్వేల్

ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం ఆయన జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైట్ మోటర్, ఆటో కార్మికులు, వాహన డ్రైవరు ఆయనను ఘనంగా సన్మానించారు. తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు,కార్మిక వర్గాలకు కావలసిన సామాజిక భవనాలను నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. అంతేకాకుండా వికలాంగులను ఆదుకునేందుకు. రూ 4016 పెంచిందన్నారు. మహిళలకు ఇప్పటికే 2016 ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. రైతు బీమా, రైతు బంధువు, డబుల్ బెడ్ రూమ్, సొంత స్థలం ఉంటే మూడు లక్షలు అందిస్తామని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంత్రి హరీష్ రావు ప్రత్యేక కృషితో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. మున్సిపల్ పాలకవర్గం సమిష్టితో నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. తాను ప్రాతినిధ్య వహిస్తున్న మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డులో సీసీ కెమెరాలకు లక్ష రూపాయలు విరాళం అందించారు. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి , తో పాటు మిగతా వార్డుల అభివృద్ధి చేస్తున్నమన్నారు. తన జన్మదిన సందర్భంగా విషెస్ చెప్పిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



బాల్యం సుమధురం

జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా చంద్రయ్య



నవ తెలంగాణ - సిద్దిపేట

బాలల కోసం ఎంత చేసినా, ఏం చేసినా తక్కువేనని ప్రతి ఒక్కరూ ఎంత ఎత్తు ఎదిగిన బాల్యంలోకి తొంగి చూస్తే మధురానుభూతి కలుగుతుందని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా చంద్రయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ప్రతి నెలా మన బాలసాహిత్యం కార్యక్రమంలో భాగంగా కథల తాతయ్య ఎన్నవెళ్ళి రాజమౌళి రచించిన మిస్సైల్ మ్యాన్ బాలగేయ సంపుటి పుస్తకావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఎన్నవెళ్ళి రాజమౌళి బాల సాహిత్యంలో విశేషంగా కృషి చేస్తున్నారని, బాలల వికాస యాత్ర అంటూ చాలా పాఠశాలల్లో కథ ,గేయం, పద్యం ద్వారా బాలల్లో చైతన్యం తెచ్చారని అన్నారు. బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం మాట్లాడుతూ బాలసాహిత్యంలో పెట్టని కోట సిద్దిపేట అని, రాబోయే రోజుల్లో బాలసాహిత్యంలో సిద్దిపేట కవులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పురస్కారాలు రావలసిన అవసరం ఉందన్నారు. కవి గాయకులు వర్కోలు లక్ష్మయ్య పుస్తక సమీక్ష చేస్తూ ఎన్నవెళ్ళి రాజమౌళి బాల సాహిత్య కృషిని కొనియాడారు. మిస్సైల్ మ్యాన్ బాలగేయ సంపుటి పుస్తక రచయిత ఎన్నవెళ్ళి రాజమౌళిని కవులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగీతం నర్సింహరావు, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, పిస్నింటి మహేంద్రారెడ్డి, డబ్బికార్ సురేందర్, శ్రీచరణ్ సాయిదాస్, ఎనిశెట్టి సతీష్ కుమార్, పెందోట వెంకటేశ్వర్లు, మిట్టపల్లి పర్శరాములు, బెజగం శ్రీనివాస్, చీకటి రాములు, ఉప్పరిపల్లి బాలచంద్రం,లక్కారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

22వ తేదీన గజ్వేల్‌లో ఒలింపిక్ డేరన్



నవ తెలంగాణ- గజ్వేల్

37వ ఒలింపిక్ డే రన్‌ను గజ్వేల్‌లో నిర్వహించుటకు తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ అనుమతి పత్రాన్ని అందించినట్లు ఒలంపిక్ డే రన్ నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్ డే రన్-2023 కమిటీ కన్వీనర్ కుంటనోళ్ళ శివ కుమార్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్ డే రన్ గజ్వేల్‌లో నిర్వహించుటకు అనుమతించిన తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం గజ్వేల్ లో ఒలింపిక్ డే రన్ నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా అదే విధంగా 22న ఉదయం 7 గంటలకు ప్రజ్ఞా గార్డెన్ నుంచి సీయమ్ క్యాంపు కార్యాలయం వరకు ఉంటుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ నుండి కళాశాలల నుండి పెద్ద ఎత్తున 500 మంది విద్యార్థిని విద్యార్థులతో పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, కో - చైర్మన్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధాసు శ్రీనివాస్ కన్వీనర్ సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్ కో-కన్వీనర్లు రాష్ట్రపతి అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు, గజ్వేల్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు యాదవ్ , సభ్యులుగా అహ్మద్, మతీన్, పి.ఇ.టీలు నాగేష్, గోవర్ధన్ రెడ్డి,నరేష్ , విజయ రేఖ ,మహేష్ , జిలానీ, తదితరులు ఉన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పరిసర ప్రాంత పౌరులు ప్రతి ఒక్కరూ బాధ్యతగల పౌరులుగా మంచి స్పోర్ట్స్ స్పిరిట్‌తో మాకు సమాచారం లేదు అనే భావనను వీడి స్వచ్ఛందంగా వచ్చి ఒలింపిక్ డే రన్ - 2023 లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ నేతలు అందరూ సొంతగూటికి రావాలి

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి



నవ తెలంగాణ- గజ్వేల్

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తిరిగి సొంతగూటికి రావాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో పార్టీ కార్యకర్తలను నాయకులను కలుసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, తిరిగి పార్టీలో క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. 2023లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం ఖాయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటున్న కార్యకర్తలు, నాయకులు పార్టీ పిలుపు ఇచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సిద్దిపేట జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దామని అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి ఇతర పార్టీలో చేరిన నాయకులు కార్యకర్తలు తిరిగి సొంతగూటికి రావాలని కోరారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ నేతృతంలో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు నాయకులు పట్టుకొమ్మలాంటి వారిని వారందరినీ తిరిగి వెనుకకు రప్పిస్తామని ఆయన చెప్పారు. ప్రతి గ్రామాన్ని తిరిగి ప్రతి కార్యకర్తను కలుస్తున్నట్లు ఆయన అన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు సీనియర్ నాయకులు రోజువారిగా పార్టీ బలోపేతంపై భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకుంటున్నామని అన్నారు. రానున్న మూడు నాలుగు నెలల్లో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో పూర్వం నాయకులందరూ సొంత గూటికి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్, నక్క రాములు, మొనగారి రాజు, ఐల మహేందర్ తదితరులున్నారు.

రెవెన్యూ డివిజన్ సాధన కోసం గ్రామాల్లో క్షేత్రస్థాయి కమిటీలు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం గ్రామాల్లో క్షేత్రస్థాయి కమిటీలు వేస్తున్నట్లు జేఏసీ వైస్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి తెలిపారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో ఆదివారం చేర్యాల మండల స్థాయి జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగంరెడ్డి మాట్లాడుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గత ఐదు సంవత్సరాలుగా అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఇంత ఉద్యమం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమ పోరాట తరహాలో రెవెన్యూ డివిజన్ సాధన కోసం సకల జనులు ఏకమై రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం)మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు అందె అశోక్, టిడిపి మండల అధ్యక్షులు కూరారం బాల నరసయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ పర్పాటకం మాధవరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తడక లింగం గుప్తా, జిల్లా వెంకటేశం, బండారి సిద్దయ్య, దొడ్డిని నాగరాజు, బట్టి చంద్రయ్య, భాస్కర్ రెడ్డి, చందు, మైసయ్య చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ శంకర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ డాకూరి శంకర్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో శంకర్ పాల్గొన్నారు. శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు. కేక్ తినిపించి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, హరికృష్ణ గౌడ్, మాజీ ఎంపిటిసి డిజి. వెంకటేశం, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్, ప్రీతం రెడ్డి, చిట్యాల మధు, ఉలువల సతీష్, రాజశేఖర్, అశోక్, కృష్ణ, మహేష్ గౌడ్, యాదగిరి, వీరేశం, మురళి పాల్గొన్నారు.

కార్యకర్తలు ఐక్యంగా ఉన్నప్పుడే విజయాలు సాధ్యం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని శాఖల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేస్తే అన్ని విజయాలు తమవైనని ఎంపీపీ గిరిధర్ రెడ్డి అన్నారు. తన గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ఎల్డిఎం సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐఎన్‌టియుసి ఎన్ఎస్యుఐతో పాటు పార్టీకి చెందిన వివిధ శాఖల నిర్వాహకులు, ఆయా శాఖల కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి శాయ శక్తుల్లా కృషి చేయాలని.. అధిష్టానం పిలుపులన్నిటిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ మక్షుత్, రామలింగారెడ్డి, నరసింహారెడ్డిమాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా మంచినీటి పండుగ



నవతెలంగాణ-న్యాల్‌కల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలో గ్రామాల్లో మండల అధికా రులు, ఆయా గ్రామాల నాయకులు, సర్పంచులు, మహిళలు తాగునీటి పండుగను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ డిఈ సాబేర్ హుస్సేన్ ఈ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిషన్ భగీరథ ట్యాంకులతో ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్న దన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాఘవరావు, వివిధ శాఖల అధికారులు సాబేర్ హుస్సేన్, జనార్దన్ రావు, పంచాయతీ సెక్రెట రీలు రవీందర్, నాగభూషణం, శిల్ప, గాయత్రి, మండల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గంగ్వార్ నిరంజన్ రెడ్డి, శివ శంకరయ్య స్వామి, భూమా రెడ్డి, కుతుబోద్దీన్, పీటర్, జగన్నాథ్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహిపాల్ పాల్గొన్నారు.

మైనార్టీల పట్ల సర్పంచ్ చిన్నచూపు!



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల కేంద్రంలో గల మైనార్టీల పట్ల పుల్కల్ సర్పంచ్ చిన్నచూపు చూస్తున్నాడని పలువురు మైనార్టీ ముస్లిం సోదరులు ఆరోపిం చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ.. మైనార్టీ కాలనీల్లో కనీసం తాగడానికి నీరు కూడా రావడం లేదని వాపోయారు. ఈ సర్పంచ్ బీజేపీకి చెందిన వ్యక్తి కావడంతో.. మైనార్టీల పట్ల కావాలనే చిన్నచూపు చూస్తున్నాడని ఆరోపించారు. మైనార్టీ కాలనీలలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. ఈ విషయాన్ని పలుమార్లు సర్పంచ్‌కు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అంతేకాకుండా ఎవరెన్ని ఆరోపణలు చేసినా తనకు ఒరిగిందేమి లేదని దురుసుగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైనార్టీల కాలనీల్లో మురికి కాలువలు, సీసీరోడ్లు నిర్మించాలని కోరుతున్నారు. లేని యెడల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి మోడీ ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిందని కేంద్ర పశుసంవర్ధక, చేపల శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణ ంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. అనంతరం స్థానిక అతిథి హెూటల్లోవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తొమ్మిదేండ్ల ప్రధాని మోడీ పాలనాలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. ఆకాంక్ష జిల్లాల పథకం ద్వారా దేశంలోని వెనకబడ్డ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రధాని సూచనలతో మంత్రులు నార్త్‌ఈస్ట్ రాష్ట్రాల్లో పర్యటించగా.. ఆ రాష్ట్రాలు అభివృద్ధి చెందాయన్నారు. పంచాయతీలకు రూ.2.5.లక్షల కోట్ల నిధులివ్వడంతో.. గ్రామాలన్నీ సమృద్ధిగా అభివృద్ధి చెందాయన్నారు. 2014 వరకు కేవలం 6వేల గ్రామ పంచాయతీలకు భవనాలు ఉండగా, తమ పాలనలో 30 వేల గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించామన్నారు. జన్‌ధన్ అకౌంట్ వల్ల కొత్త గా 49కోట్లు అకౌంట్లు తెరవగా.. ఇందులో 37.కోట్లు అకౌంట్‌లను మహిళలు తెరిచి, వీటిలో 2.లక్షల కోట్ల రూపాయలను జమ చేశారన్నారు. నేడు ప్రపంచ దేశాలని మోడీ మోడీ అంటూ భారతదేశం వైపు చూస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ రవి గౌడ్, కో కన్వీనర్ కే.శ్రీనివాస్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు అరుణతార, నరేందర్ రెడ్డి, జిల్లా రాష్ట్ర నాయకులు రాజనర్సింహ, సుధీర్ శ్రీనివాస్ గౌడ్, నవ జగన్ వెంకటరామిరెడ్డి, సంగప్ప, విజయపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, విజేందర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, బక్కయ్య గుప్తా, సుదీర్ బండారి తదితరులు పాల్గొన్నారు.

అల్లాడి ఇంట్లో టిఫిన్.. ఉపాధ్యాయ సంఘం నాయకుడి ఇంట్లో భోజనం

ప్రముఖ వ్యాపారవేత్త అల్లాడి వీరేశం ఇంట్లో టిఫిన్ చేసిన కేంద్రమంత్రి.. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడి ఇంట్లో భోజనం చేశారు. మహిళా నాయకురాలు అర్చన శారద ఇంట్లో మన్‌కీ బాత్ కార్యక్రమానికి హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటలకు జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి ప్రయాణికులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వివిధ సంఘాల నాయకులతో మేధావులతో కుల సంఘాల నాయకులతో చర్చలు జరిపి వారి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈసారి రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తీసుకోవల్సిన చర్యలకై వివిధ వర్గాల ప్రజలకు సంఘాలకు నాయకులతో సంప్రదింపులు చేశారు.



జిల్లా వ్యాప్తంగా ఎన్ఎంఆర్ యువసేన సేవలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలోని పలు కాలనీలల నుండి ఎన్ఎంఆర్ యువసేన నిర్వహించిన ఆత్మీయ పరిచయ కార్యక్రమానికి నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగానే కాక జిల్లా వ్యాప్తంగా ఎంతో మందికి ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు సేవలు అందిస్తున్నారని నీలం మధు తెలిపారు. తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్య మంత్రి కేసిఆర్ చేస్తున్న కృషిని చూసి ఈ ఎన్ఎంఆర్ యువసేన స్థాపించామన్నారు. అనుకున్న స్థాయి కన్నా ఎక్కువగా ఎన్ఎంఆర్ యువ సేనను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఇప్పటికే చాలామందికి సేవలందించి ఎంతో మంది అభిమానాన్ని చూరగొందన్నారు. భవిష్యత్తులో కార్యాచరణ రూపొందించి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించదల్చామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిరంతరం అందిస్తున్న సేవలు ఎంతోమందికి ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. ఇది ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. నియోజకవర్గం ప్రజలు నా వెంటే ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలు చురుకుగా కొనసాగిస్తానని ఆయనకు తెలిపారు. పార్టీలకతీతంగా ఎన్ఎంఆర్ యువసేనలో ఎంతోమంది చేరుతున్నారని, చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆకర్షితులై వారు కూడా సేవ చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాము,శ్రీనివాస్ రావు, కోటేశ్వర రావు, శశి, శరత్, ప్రకాష్, మల్లికార్జున్, నాగేంద్ర, తరుణ్, రవీంద్ర, రమణ, సంతోష్, చందు, రమేష్, రాజేంద్ర, రవీంద్ర, కాలనీ వాసులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఏమి సాధించారని పట్టణ ప్రగతి ఉత్సవాలు?

నవతెలంగాణ-జహీరాబాద్

ఏమి సాధించారని ప్రగతి ఉత్సవాలు జరుపుతున్నారో సమాధానం చెప్పాలని టీపీసీసీ నాయకులు వై.నరోత్తం అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్టంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణా దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాధనంతో పార్టీ ప్రచారం చేసుకుంటున్నదని ఆరోపించారు. అవి ప్రభుత్వ కార్యక్రమాల్లా లేవని.. బీఆర్ఎస్ సమావేశాల్లా ఉన్నాయన్నారు. పట్టణ ప్రగతి పేరుతో ఉత్సవాలు జరపడం చూస్తే హాస్యాస్పదంగా ఉందని.. పట్టణంలో ఎం ప్రగతి జరిగింది ఉత్సవాలు చేస్తున్నారో చెప్పా లన్నారు. ఇప్పటి వరకు పురపాలక ఎన్నికలు జరపనందుకు సిగ్గు పడాల్సింది పోయి ఉత్సవా లు జరపడమేమిటని ప్రశ్నించారు. పట్టణంలో సరైన రోడ్లు, మురికి కాలువలు లేవు, తాగు నీరు ఎప్పుడొస్తాయో తెలియని దుస్థితి ఉన్నదన్నారు. పురపాలకలో విలీన గ్రామాల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉందన్నారు. పట్టణంలో అక్ర మ కట్టడాలపై చర్యలే లేవు, పట్టణ అభివృద్ధు కోసం సీఎం కేసీఆర్ ప్రకటించిన నిధులు మరి యు మంత్రి కే.టి రామారావు ప్రక టించిన నిధు లు ఎక్కడున్నాయి?, ఆ నిధులతో పట్టణంలో చేసిన అభివృద్ధి ఏమిటో వెంటనే చెప్పాలన్నారు. ప్రజలపై ప్రేమ, పట్టణ అభివ ృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే పురపాలక ఎన్నిక లు జరిపించా లన్నారు. ప్రజలు సమస్యలతో సతమతమ వుతు ంటే ఉత్సవాలు చేయడం వారిని తప్పుదారి పట్టించడమే అవుతుంద న్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ కౌన్సిలర్ సునీల్ కుమార్, మహ మ్మద్ యూసుఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జులై 6 నుంచి గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె



నవతెలంగాణ-సదాశివపేట

పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేల రూపాయలు ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని.. వారికి రావలసిన చట్టపరమైన సౌకర్యాల కోసం జులై ఆరో తేదీ నుంచి గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ అన్నారు. సదాశివపేట మండలంలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల సమావేశాన్ని స్థానిక ఎంపీడీవో ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న వారి గురించి మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇచ్చే విధంగా వివిధ కేటగిరీలుగా రూ.15600, రూ.19,200, రూ.22,700 ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి వారికి వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు దశరథ్, గ్రామపంచాయతీ యూనియన్ సదాశివపేట మండల నాయకులు శేఖర్, ముస్తఫా, బుచ్చయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియాకు బెదిరింపులు



నవతెలంగాణ-వట్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల అంతు చూస్తామని బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే అనుచరులు బెదిరింపులకు పాల్పడుతు న్నారని .. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు ఎటువంటి హాని జరిగినా, దాడులు జరిగిన సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాదీరాబాద్ రమేష్ జోషి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ జోషి మాట్లాడారు. నాగులపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్.. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నాడని.. మర్యాదగా వచ్చి కలవాలం టూ అల్లాదుర్గం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జార్జి నిత్యం శ్రీకాంత్‌ను వేధిస్తున్నాడన్నారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వట్‌పల్లి మండల పోలీసులు కూడా ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా పాకిస్తాన్‌లో ఉన్నామా అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు తమ వైఖరి మార్చుకోకపోతే ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ బద్ధంగా కల్పించిన హక్కును ఎవరు హరించడానికి వీల్లేదు అన్నారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిగంబర్ రావు. మాజీ సర్పంచులు అశోక్ గౌడ్. నాగులపల్లి, సంగారెడ్డి, వట్‌పల్లి, పార్టీ నాయకులు శంకరప్ప, వినోద్, గొరిల్లా మల్లేశం, నాగయ్య, పెద్ద శంకరంపేట, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్ట ఎపిఓ సుధాకర్, బిజిలిపూర్ ప్రశాంత్, నాగయ్య. తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-పటాన్‌చెరు

మధ్య రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని బిడిఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాశం మైలారం గ్రామానికి చెందిన లలిత, పోశయ్య దంపతుల కూతురు మౌనిక (20) శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో వెళ్లి.. అదృశ్యమైంది. అదే రాత్రి చుట్టుపక్కల, బంధువుల వద్ద, తెలిసినవారి దగ్గర వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు బీడీఎల్ ఎస్సై మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.